రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 27 : ఓయూ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే పీజీ డిప్లొమా ఇన్ డేటా సైన్స్ కోర్సు పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఈ కోర్సు మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తర్వాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ. 800 చొప్పున చెల్లించి ఈ నెల 30లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osm ania.ac.inలో చూసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

ఘట్‌కేసర్,నవంబర్27: పోచారం మున్సిపాలిటీలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల హెచ్‌అండ్‌ఎస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ చిర్ర స్వాతికి హైదరాబాద్‌లోని డీమ్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు.ఆమె బయోలాజికల్ స్క్రీనింగ్‌పై కెమిస్ట్రీ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ ఎం. రవీందర్ పర్యవేక్షణలో పరిశోధన చేశారని తెలిపారు. ప్రొ. స్వాతిని కళాశాల యాజమాన్యం అధ్యాపకులు అభినందించారు.

విరాళాలను భక్తుల సౌకర్యాలకే వినియోగిస్తున్నాం..

- శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్, షిరిడీ ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి గోరక్ష మహదేవ్ గాడిల్కర్

మన్సూరాబాద్, నవంబర్ 27: షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌కు వచ్చే విరాళాలను ప్రజాసేవకు, భక్తుల సౌకర్యాలకు వినియోగిస్తున్నామని శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్, షిరిడీ ఆలమ ముఖ్య కార్యనిర్వహణాధికారి గోరక్ష మహదేవ్ గాడిల్కర్ తెలిపారు. షిరిడీ సాయి భక్త ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సాయిబాబా ఆలయ నిర్వాహకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ట్రస్ట్‌కు ఇచ్చే విరాళాలను దారి మళ్లిస్తున్నారనే ఆరోపణల్లో నిజం లేదన్నారు. సీఈఓ, కలెక్టర్, హైకోర్టు జడ్జితో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ పర్యవేక్షణలో ట్రస్ట్ నడుస్తుందన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 50 లక్షల వరకు సేవా కార్యక్రమాల కోసం.. ఆపైన హైకోర్టుకు తెలిపి వారి అనుమతితో ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారుల సమక్షంలో సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో భక్తులు ఇచ్చే విరాళాల లెక్కించి బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టింగ్‌లు పెడుతున్న వారిపై ట్రస్ట్ ఆధ్వర్యంలో కేసులు పెట్టామన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దవాఖానల్లో వైద్యం కోసం వచ్చే వారి వద్ద కేవలం రూ. 10 తీసుకుని గుండె ఆపరేషన్లతోపాటు ఇతర వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. సాయిబాబా దర్శనానికి వచ్చే భక్తులు సుమారు 50 వేల మందికి అన్నదానం చేస్తున్నామన్నారు. ఇప్పటికే 6 వేల మంది పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ట్రస్ట్ ఆర్థిక సహాయం అందిస్తుందని.. త్వరలోనే వేలాది మందికి ఉన్నత విద్యను ఉచితంగా అందించే ప్రక్రియను ప్రారంభించబోతున్నామన్నారు.

రామ జన్మభూమి కోసం సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ నిధులు మంజూరు చేయలేదన్నారు. ప్రతి ఇంటి నుంచి నిధులు తీసుకోవాలని రామజన్మభూమి తీర్మానం చేసి నిధులు సేకరించిందని తెలిపారు. సంస్థల నుంచి డబ్బులు తీసుకోలేదని.. షిరిడీ సంస్థాన్ నుంచి నిధులు కావాలని అడగలేదన్నారు. బాబా ఏ మతానికి, ఏ ధర్మానికి చెందిన వాడు కాదని.. ఆయన సర్వ ధర్మాలు పాటించాడని పేర్కొన్నారు. సాయిబాబా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.

షిరిడీ సాయి భక్త ఐక్య వేదిక తెలంగాణ అధ్యక్షుడు మంచికంటి ధనుంజయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, ఐక్య వేదిక కార్యదర్శి పీవీ సాయి, కోశాధికారి గుండా మల్లయ్య, కమిటీ సభ్యులు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతు, వెంకటరాంరెడ్డి, ఈశ్వరమ్మయాదవ్, రవీంద్రబాబు, సాయిబాబా, ప్రసాద్‌రావు, హరిప్రసాద్‌రావు, ఎం. ప్రసాద్, అనిల్, సాయిశ్రీనివాస్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోరక్ష మహదేవ్ గాడిల్కర్

అయ్యప్ప పడిపూజకు రావాలని కేటీఆర్‌కు ఆహ్వానం

ఎమ్మెల్యేలు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డికి అహ్వానపత్రికను అందజేస్తున్న అయ్యప్ప మాలధారులు

కందుకూరు, నవంబర్ 27 : మండలంలోని రాచులూరులో డిసెంబర్ 1న నిర్వహించనున్న 18 మెట్ల మహా పడిపూజకు రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని పలువురు అయ్యప్ప మాలధారులు ఆహ్వానించారు. బుధవారం రాచులూరుకు చెందిన బేతు రాఘవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ మండల నాయకులు తాళ్ల కార్తిక్, బొక్క దీక్షిత్‌రెడ్డి తదితరులు వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్ రెడ్డి, మాజీ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మణాచారి, అయ్యప్ప మాలధారులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు..

- హామీలను నెరవేర్చే వరకు నిలదీస్తాం..
- బీఆర్ఎస్ కందుకూరు నాయకులు

కందుకూరు, నవంబర్ 27 : కాంగ్రెస్ పార్టీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని.. ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని కందుకూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేయడం తప్పా? అని ప్రశ్నించారు. హామీలను నెరవేర్చే వరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పైసా అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. కొందరు నాయకులు సబితా ఇంద్రారెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని, ఆమెను విర్శించే స్థాయి వారికి లేదన్నారు. ఉనికిని కాపాడుకోవడానికి మాట్లాడటం భావ్యం కాదన్నారు. విమర్శలు చేసే ముందు గత చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని ఆయన సూచించారు. అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సురుసాని సుదర్శన్‌రెడ్డి, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి తదితరులు

రిజిస్టర్,స్పీడ్‌పోస్ట్ విలీన ప్రతిపాదనను విరమించుకోవాలి

అబిడ్స్ జీపీవో ఎదుట నిరసనలో పాల్గొన్న పోస్టల్ ఉద్యోగులు

సుల్తాన్‌బజార్,నవంబర్ 27: రిజిస్టర్,స్పీడ్ పోస్ట్ విలీన ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని పోస్టల్ శాఖ ఆల్ ఇండియా నాయకులు కామ్రేడ్ సురేష్,ముక్తార్ అహ్మద్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం అబిడ్స్ జనరల్ పోస్టాఫీస్ ఎదురుగా అఖిల భారత ఆర్ఎంఎస్, ఎంఎంఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోస్టల్ శాఖ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్, మంచిర్యాల సార్టింగ్ కార్యాలయాల్లో ఐసీహెచ్,పీహెచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ఎంఎస్‌లను మూసివేయడంతో పాటు సెక్షన్లను నిలిపివేయడం వంటి చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, నవంబర్ 27 : చార్మినార్ మండలం అజంపుర, చావునీ డివిజన్ల పరిధిలో 26 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ పంపిణీ చేశారు. బుధవారం పాతబస్తీ ఫంజేషాలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు.

కార్యక్రమంలో చార్మినార్ తహసీల్దార్ నిహారిక, నాయబ్ తహసీల్దార్ మన్సూర్ అలీ సిద్ధిఖీ, మహ్మద్ రిజ్వాన్, మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీదర్, గుల్బర్గా గ్యాంగ్‌స్టర్లతో జాగ్రత్తగా ఉండాలి

శామీర్‌పేట, నవంబర్ 27: బీదర్, గుల్బర్గా గ్యాంగ్‌స్టర్లతో వ్యాపారస్తులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని శామీర్‌పేట పోలీస్ శ్రీనాథ్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. బీదర్, గుల్బర్గాలోని గ్యాంగ్‌స్టర్లు ముఠా సభ్యులు వెచ్చటి దుప్పట్లు అమ్మేవారిగా నటిస్తూ చౌకైన వస్తువులను విక్రయించే పేరుతో స్థానిక కాలనీల్లో ఇండ్లు, షాపులు మొదలైన వాటిలో రెక్కీ నిర్వహిస్తారన్నారు. అవకాశం కోసం వెతుకుతారని ఇండ్లల్లోకి ప్రవేశించి దోచుకుంటారని ప్రజలు, వ్యాపారస్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

అలరించిన భక్తిగీతాల విభావరి

ముషీరాబాద్, నవంబర్ 27: రాగరాగిణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో స్వర జగన్నాథం పేరిట నిర్వహించిన కార్తిక మాస భక్తిగీతాల విభావరి ఆకట్టుకున్నది. గాయకులు ఎం.వి. రమణకుమారి, స్వర్ణ, విజయకుమార్, ఖాసీం, ప్రభాకర్ రావు, కమలాకర్, వేణుగోపాలాచారి, ఉదయ్‌కిరణ్ భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో గాయకుడు సీహెచ్ త్రినాథరావు ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులను సన్మానించారు.

ఆయుష్‌ను సందర్శించిన బీఆర్‌కేఆర్ విద్యార్థులు

ఆయుష్ సంస్థను సందర్శించిన బీఆర్‌కేఆర్ ఆయుర్వేద కళాశాల విద్యార్థులు, ఆయుష్ ప్రతినిధులు

సైదాబాద్, నబంబర్ 27 : సైదాబాద్ డివిజన్ గడ్డి అన్నారంలోని ఆయుర్వేద పరంపర సంస్థను బుధవారం డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులు సందర్శించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జ్ఞానేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ విశ్వనాథన్ పర్యవేక్షణలో ప్రథమ సంవత్సరం ఆయుర్వేద విద్యార్థులు ఆయూష్‌ను పరిశీలించారు. ఆయూష్ సంస్థల పనితీరు, గ్రంథాలయంలోని పురాతన, సంగ్రహాలయంలోని తాళపత్ర గ్రంథాలు, వైద్య చికిత్స, చరిత్రకు సంబంధించిన విషయాలను ఆయూష్ పరిశోధన అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ అశ్వాక్ మహ్మద్, వైరముత్తు, మురళీ మనోహర్ విద్యార్థులకు వివరించారు.

సంప్రదాయబద్ధంగా దివ్యాంగురాలి వివాహం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేశ్‌రెడ్డి తదితరులు

సైదాబాద్, నబంబర్ 27 : రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సైదాబాద్ బ్యాంక్ కాలనీలోని శ్రీనివాస కమ్యూనిటీ హాల్‌లో మోనిక(దివ్యాంగురాలు) రాజేశ్‌ల వివాహం సంప్రదాయ పద్ధతిలో జరిగింది. ఈ వివాహానికి గడ్డిఅన్నారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేశ్‌రెడ్డి, ఆర్ఎస్ బ్రదర్స్ ఎండీ సిర్నా రాజమోళి, రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ అధ్యక్షుడు పెద్ది శంకర్‌గౌడ్, రామ్ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు కుంచం నర్సింహారావు, మాడ్లూరి లక్ష్మణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుల, మత, వర్గాలకు అతీతంగా అనాథలు, దివ్యాంగులు, పేద యువతీయువకులకు ఉచితంగా ఆదర్శ వివాహాలు జరిపిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్‌కుమార్, అరుణ తెలిపారు. దాతలు చేసిన ఒక్క రూపాయితో ఈ వివాహాలను జరిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ నరసింహ

కందుకూరు, నవంబర్ 27 : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి నరసింహ సూచించారు. బుధవారం కందుకూరులో విద్యార్థులకు మండల స్థాయిలో 'పునరుత్పాదక శక్తి వనరులు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నేదునూరు ప్రభుత్వ మాడల్ స్కూల్ విద్యార్థులు చీమల వైష్ణవి(10వ తరగతి), చీమల వర్షిణి(9వ తరగతి), జాపాల వర్షిత(8వ తరగతి) పోటీల్లో గెలుపొందారు. విద్యార్థులను అభినందించిన అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్, సీఆర్‌పీ వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నవంబర్ 27 : ఆస్మాన్ ఘడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ విష్ణువర్ధన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శ్రావణి హాస్పిటల్, 11 కేవీ సలీమా కాటూన్,11కేవీ ఆనంద్‌నగర్, 11కేవీ లక్ష్మీనగర్, 11 కేవీ ఖాన్‌నగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు,11కేవీ సోమనాథ్ టెంపుల్,11కేవీ జడ్జెస్ కాలనీ,11కేవీ పూర్ణోదయ కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ తెలిపారు. బీసీఏ (సీబీసీఎస్), బీ ఫార్మసీ (పీసీఐ) ఏడో సెమిస్టర్ పరీక్షల రివాల్యూయేషన్ ఫ లితాలను విడుదల చేసినట్లు చెప్పారు. వాటిని వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ

అంబర్‌పేట, నవంబర్ 27: డిసెంబర్ 8న నర్సంపేటలో జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మొగిలి ప్రతాప్ రెడ్డి, బి.భాస్కర్, ఐఏఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.విశ్వనాథ్, ఆరెల్లి కృష్ణ, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సరళ తదితరులు మాట్లాడుతూ అరుణోదయ తన నాలుగు దశాబ్దాల ప్రయాణంలో ఎన్నో త్యాగాలు చేసిందని, ప్రజల సమస్యలపై గానం చేసిందని, ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలించిందన్నారు.

మురుగు పారుతున్నా.. పట్టించుకునే వారేరి?

- ప్రజా సమస్యలను పట్టించుకోని జల్‌పల్లి మున్సిపల్ అధికారులు
- దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు

16వ వార్డులో ఇండ్ల మధ్య నిలిచిపోయిన మురుగు నీరు

పహాడిషరీఫ్, నవంబర్ 27 : వానకాలం పోయినప్పటికీ నేటికీ డ్రైనేజీ మురుగు పారుతూనే ఉన్నది. రోడ్లపై మురుగు నీటి పారుదలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పక్కన పెట్టేయడంతో నెలల తరబడిగా స్థానికులు ఆ దారిలో ముక్కుమూసుకుని వెళ్తూనే ఉన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు హనుమాన్ దేవాలయ ప్రాంతంలో రోడ్డుపై నిత్యం మురుగు పారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ల ముందు చేరి నిలిచిపోతున్నది. డ్రైనేజీ వ్యవస్థ లోపభూయిష్టంగా ఏర్పాటు చేయడంతో లోతట్టు ప్రాంత వాసులకు ఇది శాపంగా మారింది. ఫలితంగా ఆ ప్రాంతంలో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తుండటంతో స్థానికులకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డుపై పలువురు మహిళలు జారిపడి గాయాల పాలయ్యారు.

కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం..

ఈ విషయమై స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్నపాపాన పోవడంలేదని పలువురు మండిపడుతున్నారు. నెలల తరబడి మురుగు నీటితో ఇబ్బంది పడుతున్నా ఇంజినీరింగ్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యను పరిష్కరించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై మురుగు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలోచింపజేసిన 'స్వేచ్ఛ నాటకం'

రసరంజని హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారు సమర్పించు స్వేచ్ఛ నాటకం రవీంద్రభారతిలో నిర్వహించారు. నాటకం మూల కథ ఎస్.నారాయణ, నాటకీకరణ పరమాత్ముని శివరాం, దర్శకత్వం బీఎమ్ రెడ్డి వహించిన స్వేచ్ఛ నాటకం వీక్షకులను ఆలోచింపజేసింది.ఈ నాటకానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, పూర్వ ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణాచారి విచ్చేసి వీక్షించారు. ట్రెజర్ మోహన్ సేనాపతి,రసరంజని సెక్రటరీ నటరాజ్ పాల్గొన్నారు. – రవీంద్రభారతి

ఆన్‌లైన్ నమోదులో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు

- ఎన్యూమరేట్లరు, సూపర్‌వైజర్లే బాధ్యత వహించాలి
- కలెక్టర్ గౌతమ్ హెచ్చరిక
- ఇద్దరు ఎన్యూమరేటర్ల సస్పెండ్‌కు ఆదేశం

ఆన్‌లైన్‌లో సర్వే వివరాల నమోదు ప్రక్రియను తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్ పొట్రు

మేడ్చల్, నవంబరు 27: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నమోదులో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తప్పవని 'ఆన్‌లైన్ నమోదు పూర్తి గాఎన్యూమరేటర్లు,సూపర్‌వైజర్లదే బాధ్యత అని జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు హెచ్చరించారు. బుధవారం మేడ్చల్ మున్సిపాలిటీలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఇంటింటి సర్వే వివరాల ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేటర్లది కేవలం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం వరకే బాధ్యత అని, ఎలాంటి తప్పుడు జరిగిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్యూమరేట్లర్లు పక్కన ఉన్నప్పుడే ఆపరేటర్లు సర్వే వివరాలను అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమయం వృథా కాకుండా ఎన్యూమరేట్లర్లు,ఆపరేటర్లు ఒకే సమయంలో భోజనం చేయాలని సూచించారు.సూపర్‌వైజర్లు ఎన్యూమరేట్లర్లు,ఆపరేటర్లపనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్ కళాశాలను సందర్శించిన సమయంలో ఆపరేటర్ పక్కన అందుబాటులో ఇద్దరు ఎన్యూమరేట్లర్లు లేనట్టు గుర్తించారు. వెంటనే ఆ ఇద్దరిని సస్పెండ్ చేయాలని ఆయన ఆదేశించారు.

ఏటీసీ పనుల పరిశీలన

మేడ్చల్ ఐటీఐ కళాశాలలో నిర్మిస్తున్న అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్(ఏటీసీ) నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ గౌతమ్ పొట్రు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. ఫ్లోరింగ్, సీడింగ్, ఎలక్ట్రిక్ వర్క్స్, విండోస్, పార్టిషన్ వంటి నిర్మాణ పనులు పూర్తవ్వడానికి ఇంకా ఎంత సమయం పడుతుందని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో 6 ట్రేడింగ్ విభాగాలకుగాను గదులను నిర్మించి, మిషనరీ స్థాపించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే ఎలివేషన్, స్లాబ్ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ శ్యామ్‌సుందర్, తహసీల్దార్ శైలజ, మున్సిపాలిటీ కమిషనర్ నాగిరెడ్డి, ఎంపీడీవో సంపూర్ణ పాల్గొన్నారు.

పీటీసీలో ఆరోగ్య శిబిరం

మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మేడ్చల్ రూరల్, నవంబర్ 27: ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులను సక్రమంగా నిర్వహించగలుగుతామని, అందుకు ప్రతి పోలీస్ విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి సూచించారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి కండ్లకోయ శివారులోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో పోలీసులు, వారి కుటుంబ సభ్యుల కోసం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్, క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును బుధవారం నిర్వహించారు. ఈ క్యాంపును ప్రారంభించిన డీసీపీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు చేయించాలని సూచించారు. ఐదు రోజుల పాటు ఈ క్యాంపును నిర్వహిస్తారని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రమీల, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వయసును పెంచండి

ఉస్